లై డిటెక్టర్

వసుంధర

మొబైల్ వ్యాను—ఒక పక్కగా ఆపి అందులోంచి దిగాడు డిటెక్టివ్ కిల్లర్.

బయట ఎండ మండిపోతోంది.

కిల్లర్‌కి కడుపులో నకనకలాడుతోంది.

వీధిలో జనం ఆట్టేలేరు.

అతడు టైము చూసుకున్నాడు. టైము రెండుగంటలు.

చకచకా అడుగులు వేశాడతడు.

రోడ్డుకు అటూ యిటూకూడా హోటళ్ళున్నాయి.

కిల్లర్ పేర్లు చదువుతూ పోతున్నాడు.

చివరికి దొరికింది—అతడికి కావలసిన హోటలు.

ఆ హోటలు ప్రత్యేకత యేమీ లేదు—ఏసీ కావడం తప్ప!

కిల్లర్ హోటల్లో అడుగుపెట్టాడు—అద్దాల తలుపులు తీసుకుని.

లోపల చల్లని గాలి....

ఒక్క సారి స్వర్గంలో అడుగు పెట్టినట్లనిపించిందతడికి!

హోటల్ బాగా రష్‌గా వుంది.

లోపల చాలా గదులున్నాయి.

ఒక్కసారి వందమందికి భోజనం పెట్టడానికి సదుపాయాలున్నాయక్కడ!

కానీ బయట వేడిగా వుండడంవల్ల—లోపలకు వచ్చే జనం ఓ పట్టాన బయటకు వెళ్ళడంలేదు.

భోజనం కోసం కిల్లర్ అరగంట సేపు ఎదురుచూడాల్సి వచ్చింది. అయినా అందుకతడు విచారించలేదు.

లోపల హాయిగా వుంది.

భోజనం తాపీగా, తృప్తిగా చేశాడు కిల్లర్.

వంటకూడా రుచిగా వుంది.

"బిల్లెంతైనా ఫరవాలేదు—చాలా మంచి భోజనం" అనుకున్నాడు కిల్లర్.

క్లీనర్ వచ్చి అతడి ముందున్న మీల్స్ ప్లేటు తీసుకుని వెళ్ళిపోయాడు.

సర్వరు బిల్లుతీసుకొని వస్తాడని ఎదురుచూస్తున్నాడు కిల్లర్.

అతడు లేస్తాడని మరో వ్యక్తి ఆత్రుతగా యెదురు చూస్తున్నాడు.

అతడి అసహనాన్నీ, ఆకలినీ అర్థంచేసుకుని కిల్లర్ తనే లేచి నిలబడ్డాడు.

అతడు కూర్చున్నాడు.

కిల్లర్ హోటల్లోకి వచ్చేపోయే జనాన్ని చూస్తున్నాడు. బయటి ఎండనీ లోపలి చల్లదనాన్నీ సరిపోల్చి చూసుకుంటున్నాడు.

అలా ఎంత సేపు నిలబడ్డాడో అతడికే తెలియదు.

ఈలోగా అతడి స్థానంలో కూర్చున్న వ్యక్తికి భోజనం కూడా అయిపోయింది. అతడు బిల్లందుకుని వెళ్ళిపోతూ— "ఏమిటి సార్! మళ్ళీ భోంచేస్తారా?" అన్నాడు.

కిల్లర్ ఉలిక్కిపడ్డాడు.

అతడు వెళ్ళిపోయాడు.

అవును—సర్వర్ తనకింకా బిల్లివ్వలేదు. అడక్కుండా నే బిల్లిస్తాడని తను చూస్తూన్నాడు. ఇంకా ఇవ్వలేదేం?

ఈ రష్‌లో సర్వర్ తన గురించి మర్చిపోయాడా?

తను భోజనానికి నిలబడ్డాడని అతడనుకున్నాడేమో?

సర్వర్ టేబిల్ దగ్గరకు రాగానే కిల్లర్ అతణ్ని పలకరించి—"నువ్వు నాకింకా బిల్లివ్వలేదు—" అన్నాడు.

సర్వర్ నవ్వి—"మీ పేమెంటైపోయింది సార్!" అన్నాడు.

"అదెలా సాధ్యం?" అన్నాడు కిల్లర్ ఆశ్చర్యంగా.

సర్వర్ అతడికి దూరంగా వేలు పెట్టి చూపించాడు.

అక్కడో సోఫా వుంది. అందులో ఇద్దరు మగాళ్ళు కూర్చుని వున్నారు.

"ఆ పొడుగు చేతుల చొక్కా ఆయన మీ బిల్లు పే చేశారు—" అన్నాడు సర్వర్.

కిల్లర్ అతడినే చూశాడు.

వయసు నలభైలో వుండవచ్చు. మనిషి పొందాగా వున్నాడు. తననే చూస్తున్నాడు.

"అతడెవరో నాకు తెలియదు—" అన్నాడు కిల్లర్.

"నాకూ తెలియదు సర్—" అన్నాడు సర్వర్.

"అలాంటప్పుడు నాకెందుకు చెప్పలేదు?"

"ఆయన మీకు చెప్పొద్దన్నారు సార్! మిమ్మల్ని

డిస్టర్బ్ చెయ్యొద్దన్నారు. ప్రత్యేకించి మీరడిగితే తప్ప పలకరించి ఏమీ చెప్పొద్దన్నారు. నాకు పదిరూపాయలు టిప్పిచ్చారు కూడా!"

కిల్లర్కి సర్వర్తో దెబ్బలాడాలనుకున్నాడు. కానీ ఇందులో అతడి తప్పేముంది?

"సరేలే—" అని కిల్లర్ సోఫా దగ్గరకు వెళ్ళాడు.

పొడుగు చేతుల చొక్కా వ్యక్తి చటుక్కున లేచి నిలబడి—"మీకోసమే చూస్తున్నాను. మీతో నాకు పని వుంది—" అన్నాడు.

"నే నెవరో మీకు తెలుసా?" అన్నాడు కిల్లర్.

"తెలియదు—" అన్నాడు.

"తెలియని వ్యక్తితో మీకేం పని?"

"అన్నీ వివరంగా చెబుతాను. నాతో బయల్దేరి రండి—" హడావుడిగా అన్నాడతడు.

"ఎక్కడికి?"

"ప్లీజ్—ఇక్కడేమీ అడగొద్దు—"

కిల్లర్ మాట్లాడకుండా అతడితో బయటకు నడిచాడు.

ఆ వ్యక్తి ఎవరు? తన బిల్లెందుకు పే చేశాడు? అతడికి తనతో వున్న పనేమిటి?

ఆలోచన తీవ్రతలో కిల్లర్ కి బయట ఎండ తెలియలేదు.

ఆ వ్యక్తి ఓ రిక్షాను బేరమాడాడు.

ఇద్దరూ రిక్షా ఎక్కారు.

"ఇప్పుడు కూడా నన్నేమీ అడక్కండి. సరిగ్గా పది నిమిషాల్లో రిక్షా దిగుతాం మనం—" అన్నాడా వ్యక్తి.

కిల్లర్ మాట్లాడలేదు.

పదినిమిషాల తర్వాత ఇద్దరూ రిక్షా దిగారు.

ఆ వ్యక్తి రిక్షా అతడికి డబ్బిచ్చాడు.

అతడు కిల్లర్ చేయి పట్టుకుని తనతో నడవమన్నట్లు ముందుకి నడిచాడు.

ఇద్దరూ ఓ సందులోకి వెళ్ళారు.

"నా పేరు విల్సన్!" అన్నాడతడు నడుస్తూనే.

"ఊఁ" అన్నాడు కిల్లర్.

"నేనిప్పుడు చాలా ప్రమాదంలో వున్నాను...."

"ఊఁ."

"నన్ను మీరే రక్షించాలి—"

"నేనా?"

"అవును—మీరే!"

కిల్లర్ ఆశ్చర్యంగా—"నే నెవరో మీకు తెలుసు కదూ!" అన్నాడు.

"తెలియదు. హోటల్లో మిమ్మల్ని చూశాను. మీ ముఖంలో ఒక వింత తేజస్సు. మీ మీసాల్లో ఓ ప్రత్యేకత....నిజం చెప్పొద్దూ....మీ మీసాల్లో నాకు రక్షణ కనబడింది...."

కిల్లర్ తెల్లబోయి అతడి వంక చూశాడు.

అతడు దృఢంగా వున్నాడు. ఎత్తుగా వున్నాడు.

"మీరు నాకంటే బలంగా వున్నారు-" అన్నాడు కిల్లర్.

"బలం మనిషికి బలాన్నివ్వదు—" అన్నాడు విల్సన్.

"అంటే?"

"ఒక వ్యక్తి నన్ను చంపుతానని బెదిరిస్తున్నాడు. అతణ్ని నేను తప్పించుకుని తిరుగుతున్నాను. కానీ యెన్నాళ్ళో తప్పించుకోలేను...."

"ఎవరతడు? మిమ్మల్నెందుకు బెదిరిస్తున్నాడు?"

అన్నాడు కిల్లర్.

"నేను నారాయణా ఇంజినీరింగ్ వర్క్సులో పని చేస్తున్నాను. మా కంపెనీ పెట్రోలింజన్ని డీసెలింజనుగా మార్చడానికో కొత్త డిజైన్ రూపొందించింది. అది చాలా రహస్యం. ఆ రహస్యం సంపాదించి తనకివ్వమని ఓ వ్యక్తి నా వెంటబడ్డాడు. సంపాదిస్తే డబ్బిస్తాట— యాభై వేలు. లేకుంటే ప్రాణం తీస్తాట! అది నావల్ల కాదంటే నమ్మడు....అతడికి భయపడి నేను తాత్కాలికంగా నా మకాం కూడా మార్చేశాను...."

"ఇందుకు నేనేం చేయాలి?"

"మీరతణ్ని పట్టుకొని పోలీసులకప్పగించాలి...."

"ఆ పని మీరే చేయొచ్చుగా!"

"నాకా దమ్ములేవు...."

"నాకున్నాయని యెలాగనుకున్నారు?"

"మీ మీసాలు చూడగానే నాకలాగనిపించింది. నా అంచనా తప్పుకూడదు...."

"ఇందులో నాకేమైనా ప్రయోజనముంటుందా?"

"నేను మీకు రెండు వేల రూపాయలిచ్చుకుంటాను.." అన్నాడు విల్సన్.

"సరే—ఇప్పుడేం చేయాలి?"

"ఇద్దరం మా యింటికి వెడదాం—అది నా అసలిల్లు కాదు ప్రస్తుతం నేను రహస్యంగా వుంటున్న యిల్లు. అక్కడే నా భార్య కూడా వుంది. ఇద్దరంకలిసి అక్కడ కాసేపు చర్చించుదాం. మీరెలా చెబితే అలా చేస్తాను నేను...."

అంతా విచిత్రంగా అనిపించింది కిల్లర్కి.

"అతడినెలా కలుస్తాం?" అన్నాడతడు.

"అతడంటే—నన్ను బెదిరించే వ్యక్తేనా—? వాడు నన్నీరోజు పార్కులో కలుసుకుంటానన్నాడు. ఈ రోజు మనమిద్దరం కలిసి వెడదాం.... వాడు మీ మీసాలు చూడగానే కథ కొత్త మలుపు తిరుగుతుంది" అన్నాడు విల్సన్.

"మీ నమ్మకమంతా నా మీసాలమీదే ఉన్నట్లుంది ..."

"అవును...." అని—"ఇదే ప్రస్తుతం నా ఇల్లు—" అన్నాడతడు.

కిల్లర్ ఆగాడు.

ఆ వీధిలో యిళ్ళన్నీ విసిరేసినట్లున్నాయి.

అలాంటి వాటిలోని బంగళా పెంకింటి ముందు తామిద్దరూ నిలబడి వున్నారు.

వీధిలో జనంలేరు.

ఇంటిముందు మెట్లున్నాయి.

"రండి!" అంటూ మెట్లెక్కాడు విల్సన్.

కిల్లర్ అతడి ననుసరించాడు.

విల్సన్ గుమ్మం ముందాగి కాలింగ్ బెల్ మ్రోగించాడు.

రెండు నిముషాల్లో తలుపు తెరుచుకుంది. సుమారు ముప్పైఅయిదేళ్ళ యువతి వుంది గుమ్మానికవతల.

ఆమె ముఖంలో ఆశ్చర్యముంది.

"మీరు రేపు వస్తారనుకున్నాను—" అందామె.

విల్సన్ నవ్వాడు.

ఆమె తప్పుకుని ఇద్దరికీ దారిచ్చింది.

విల్సన్ కిల్లర్ని ముందు వెళ్ళనిచ్చి తను తలుపు వేశాడు.

"మనం ఆ గదిలో మాట్లాడుకుందాం!" అన్నాడతడు

కిల్లర్ తో.

కిల్లర్ అతను సూచించిన విధంగా పక్కగదిలోకి వెళ్ళాడు.

గదితలుపులు బార్లా తెరిచి వున్నాయి. గదిలో సోఫా సెట్టుంది.

కిల్లర్ కి గదిలో మరింకే విశేషమూ కనబడలేదు.

అతడు సోఫావరకూ వెళ్ళి వెనక్కి తిరిగాడు.

గది తలుపులు బార్లా తెరిచి వున్న విషయం తెలుస్తోంది కానీ అతడికి గది బయట ఏం జరుగుతున్నదీ కనపడడంలేదు.

విల్సన్ ఇంకా గదిలోకి రాలేదు.

బహుశా భార్యతో మాట్లాడుతున్నాడేమో!

కిల్లర్ ఆలోచిస్తుండగానే కెవ్వుమన్న గొంతు వినబడింది.

అది ఆర్తనాదం ....

ప్రాణభయంతో సర్వశక్తులూ క్రోడీకరించుకున్న మనిషి గొంతునుండి వెలువడిన నాదమది!

ఆ గొంతు స్త్రీది!

కిల్లర్ పరుగున గుమ్మం దగ్గరకు వెళ్ళాడు.

అతను గుమ్మం దాటేలోగా పైనుంచి యేదో చప్పుడయింది.

కిల్లర్ తెల్లబోయాడు.

గుమ్మానికి అడ్డంగా కటకటాలు!

అంటే ఈ యిల్లు సామాన్యమైనది కాదు....

బోనులో చిక్కిన పులిలా కిల్లర్ గుమ్మం దగ్గర ఆగిపోయాడు.

గుమ్మం అవతల ఏం జరుగుతున్నదీ అతడు చూస్తు

న్నాడు.

విల్సన్ భార్య గోడకానుకుని వుంది. విల్సన్ ఆమెకు సమీపంలో వున్నాడు. ఒక చేత్తో అతడామె కోటిని గట్టిగా మూశాడు. అతడి రెండో చేతిలో కత్తి వుంది.

ఆమె గిలగిల తన్నుకుంటోంది.

"ఏయ్ విల్సన్! ఏమిటిది?" అరిచాడు కిల్లర్.

విల్సన్ కిల్లర్ మాటలు పట్టించుకోలేదు భార్యను క్రూరంగా చూస్తున్నాడతను. "ఈ వయసులో నీకు వళ్ళు కొవ్వెక్కింది. నీ ప్రవర్తనను నేను క్షమించను. నన్నెవ్వరూ అనుమానించలేని విధంగా యేర్పాట్లు చేసుకున్నాను. చావు...."

మరుక్షణంలో కత్తి ఆమె గుండెల్లో దిగబడింది.

చివ్వున చిమ్మింది రక్తం.

జరిగిందానికి కిల్లర్ బ్రాంతపడిపోయాడు.

ఎంత సాహసికైనా వళ్ళు జలదరించే దృశ్యమది!

హత్య....కోల్డు బ్లడెడ్ మర్డర్!

విల్సన్ ఒక్క నిమిషం ఆమెనలాగే పొదివిపట్టుకున్నాడు తర్వాత వదలిపెట్టాడు. ఆమె నేలమీదకు జారిపోయింది.

కొద్దిక్షణాల్లో జీవమున్న మనిషి శవంగా మారిపోయింది.

అప్పుడు విల్సన్ కిల్లర్ వంక తిరిగాడు.

కిల్లర్ యేదో అనాలనుకున్నాడు. కానీ అతడికి స్పృహతప్పుతోంది.

ఏం జరుగుతోందో కిల్లర్‌కి అర్థంకాలేదు. ముక్కుకి వాసనేమీ తెలియడంలేదు. కానీ కళ్ళు మూతలు పడిపోతున్నాయి.

కిల్లర్ కటకటాలు పట్టుకొని తన్ను తానదుపు చేసుకుందుకు ప్రయత్నిస్తూ కిందకు జారిపోతున్నాడు.

ఎవరో తలుపులు దబదబ బాదుతున్న చప్పుడతడికి వినిపించింది.

ఆ తర్వాతింకేమీ తెలియదు.

2

ఓ గంటలో మెలకువ వచ్చింది కిల్లర్ కి.

కళ్ళు నులుముకొని చూసుకున్నాడతడు.

ఎవరో తలుపులు దబదబ బాదుతున్నారు. అందుకే అతడికి మెలకువ వచ్చింది.

కిల్లర్ కంతా మసకమసకగా వుంది.

మెదడింకా సరిగా పని చేయడంలేదు.

చప్పుడు వింటున్నా లేవాలనిపించడంలేదు.

అతడు చూస్తూండగా తలుపులు బద్దలై ముందుకు పడ్డాయి.

కిల్లర్ కి మత్తు విడిపోయింది.

చటుక్కున లేచి నిలబడ్డాడతడు.

ఈలోగా ఇద్దరు పోలీసులు కిల్లర్ని సమీపించారు.

"ఏం జరిగింది?" అన్నాడు కిల్లర్.

అప్పటికి మరికొందరు పోలీసులు, జనం లోపలికి వచ్చారు.

"ఆగండి—లోపలకు రాకండి — ఇక్కడ హత్య జరిగింది...." అంటూ అరిచాడు ఇన్ స్పెక్టర్.

హత్య అన్నమాటతో కిల్లర్ కి చాలా విషయాలు గుర్తొచ్చాయి.

హత్య తన కళ్ళముందే జరిగింది.

ఇన్ స్పెక్టర్ కిల్లర్ని సమీపించి - "యూ అరండర

లెస్ట్-" అన్నాడు.

కిల్లర్ కంతా అయోమయంగా వుంది.

"అవును—గదిలో హత్య జరిగింది. నేను స్వంతకళ్ళ కళ్ళారా చూశాను—" అన్నాడు.

"అవును— నేనూ చూశాను—" అన్నాడు ఇన్ స్పెక్టర్ నవ్వి.

"అదెలా సాధ్యం—హత్య జరిగినప్పుడు మీ రిక్కడ లేరే?" అన్నాడు కిల్లర్.

"హత్య చేసి నువ్వింకా ఇక్కడే వుండిపోయావుగా" అన్నాడు ఇన్ స్పెక్టర్.

"నేను హత్య చేయడమా?" అన్నాడు కిల్లర్.

"ప్రశ్నలు తర్వాత....నాతో పద...." అన్నాడు ఇన్ స్పెక్టర్.

"మీతో వస్తాను, కానీ నేరస్థుడిగా కాదు...." అన్నాడు కిల్లర్.

"గదిలో శవముంది. శవం గుండెల్లో కత్తి వుంది. రక్తం గదినిండా చిమ్మింది. ఆ చిమ్మిన రక్తం నీ బట్టల మీద కూడా వుంది. శవం పక్కనే నువ్వు వున్నావు.... నువ్వు నేరస్థుడివి కాదు, అవునా?" అన్నాడు ఇన్ స్పెక్టర్.

కిల్లర్ తెల్లబోయి తన్ను తాను చూసుకున్నాడు.

తన చొక్కానిండా రక్తం....

అంతేకాదు....ఆ చొక్కా తనది కాదు....

చొక్కాయేకాదు ...పాంటుకూడా తనదికాదు.

"మోసం!" అనుకున్నాడతడు.

విల్సన్ చాలా తెలివిగా తన్ని హత్యకేసులో ఇరికించాడు.

బహుశా కత్తి మీద వేలిముద్రలుకూడా తనవే అయుంటాయి.

తను స్పృహ తప్పివున్న సమయంలో అతడు తన నిష్కంతచ్చిట్లు కదిపి వుంటాడు.

"ఏమంటావు మిస్టర్!' అన్నాడు ఇన్స్పెక్టర్.

కిల్లర్ తలవంచుకున్నాడు.

ఈలోగా ఫొటోగ్రాఫరతణ్ని సమీపించి నాలుగు యాంగిల్స్‌లో ఫొటోలు తీసుకున్నాడు.

జనం కొందరు గది గుమ్మం దగ్గర నిలబడి వున్నారు. వాళ్ళంతా కిల్లర్ వంక కుతూహలంగా చూస్తున్నారు!

అంతమంది తనను హంతకుడన్న దృష్టితో చూస్తున్నారన్న భావం కిల్లర్ని కించపరిచింది.

కానీ మనిషి పరిస్థితులకు బానిస.

"ఇన్స్పెక్టర్! నిజంగా నేనీ హత్యచేయలేదు. మీరు నమ్మినా నమ్మకపోయినా నేను చెప్పకోవాల్సిన కథ ఒకటి వుంది—" అన్నాడు కిల్లర్.

"చెప్పు—" అన్నాడు ఇన్స్పెక్టర్.

కిల్లర్ చెప్పాడు.

"అచ్ఛా—" అన్నాడు ఇన్స్పెక్టర్. "అంటే ఈ యింట్లో యెన్నో మాయాజాలాలున్నాయంటావు...."

"అవును...."

ఇన్స్పెక్టర్ అక్కడున్న జనాన్ని ప్రశ్నలు వేశాడు.

"ఆ యింట్లో రెండు సంవత్సరాలుగా వుంటున్నది హతురాలు. ఆమె క్రిస్టియన్ కాదు. పేరు సుజాత. మనిషి యెంతో మంచిది. చేతనైనంతలో పదిమందికీ సాయపడుతుంది. వీధిలో చాలామందికామె అవసరానికి డబ్బిచ్చి ఆదుకుంది.

వినిరేనినట్లున్నాయి ఇళ్ళన్నీ ఆ వీధిలో. ఒకింట్లో జరిగే విషయమింకో యింట్లో తెలియదు.

సుజాత ఒంటరి ఆడది—అయినప్పటికీ—ఆమెనా వీధి వారందరూ గౌరవభావంతో నే చూసేవారు. అందగత్తె అయినప్పటికీ ఆమె అందం యెవరి చర్చల్లోకీ వచ్చేది కాదు.

వీధిలో నడుస్తున్న ఓ వ్యక్తి కాయింట్లోంచి ఆర్తనాదం వినబడి కంగారుపడి వెళ్ళి తలుపుతట్టాడు.

ఎవరూ తలుపులు తీయలేదు.

అతడు కాసేపు తలుపులు బాదాడు.

లోపల నిశ్శబ్దం!

అప్పుడతడు ఇరుగుపొరుగులను పిలిచాడు. అంతా వచ్చి తలుపులు బాదారు. లోపల నిశ్శబ్దం!

తను ఆర్తనాదం విన్నానని అతడు మరీ మరీ చెబుతున్నాడు.

అతడు భ్రమపడ్డాడని ఇరుగుపొరుగుల అనుమానం. అయితే లోపలున్నవారు తలుపులెందుకు తీయరు? లోపలేదైనా అఘాయిత్యం జరిగితే మనిషి బయటకు పోవడానికి వేరే మార్గంలేదు.

అందుకని జనమంతా ఇంటిముందు కాపలా వుండి పోలీసులకు కబురుపెట్టారు. పోలీసులు వచ్చి తలుపులు బాది—తర్వాత తలుపులు బద్దలు కొట్టారు.

గదిలో శవం.... శవం పక్కన కిల్లర్!

“నువ్వు గదిలో దేనికోసమో వెతుకుతున్నావు. జనం కాసేపు తలుపులు బాది ఊరుకోగానే—వెళ్ళిపోయారనుకొని చాలా ధైర్యంగా వున్నావు. పోలీసులు తలుపులు బద్దలుకొట్టుకొని లోపలకు వస్తారని ఊహించి

వుండవు. నీ ధైర్యం పోలీసు డిపార్టుమెంట్లో రాణించేది. అభినందించబడేది. తమ తమ విలువలు తప్పిన తమ మిత్రులు శత్రువులౌట తథ్యము.." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నా నిర్దోషిత్వాన్ని నేను ఋజువు చేసుకుంటాను.." అన్నాడు కిల్లర్.

"ఎలా?"

"కాసేపు నన్ను వదిలిపెట్టండి...."

"నో జోక్స్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అయాం సీరియస్...." అన్నాడు కిల్లర్.

ఇన్‌స్పెక్టర్ నవ్వి—"సీరియస్‌గా జైల్లో కూర్చుందువు గాని...." అన్నాడు.

ఈలోగా అక్కడ పరీక్షలు-వగైరాలు ముగించుకుని పోలీసు పరివారం ఇన్‌స్పెక్టర్ని చుట్టుముట్టారు.

"పద—మిస్టర్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నా పేరు కిల్లర్!" అన్నాడు కిల్లర్.

"ఆఫ్‌కోర్స్—యూ ఆరే కిల్లర్!" అని ఇన్‌స్పెక్టర్ కిల్లర్ చేయి పుచ్చుకున్నాడు.

అప్పుడు కిల్లర్ ఇన్‌స్పెక్టర్ని ఒక్క తోపు తోశాడు. అతడి చుట్టూ పరివారాన్ని ఒక్కసారి విదిలించాడు. ఒకేఒక్క గెంతులో గమ్యం చేరాడు.

అక్కడున్న జనం అప్రయత్నంగా పక్కకు తప్పుకుని అతడికి దారి నిచ్చారు.

కిల్లర్ రోడ్డుమీదకు వచ్చాడు.

పోలీసు జీపు సిద్ధంగా వుంది.

ఇన్‌స్పెక్టరు, పరివారం రోడ్డుమీదకు వచ్చేసరికి జీపు స్టార్టయింది.

ఇన్‌స్పెక్టరు జాప్యం చేయలేదు. క్షణాలమీద పరి

వారానికి ఆర్డరిచ్చాడు.

వీధిలో సిద్ధంగా వున్న రెండు మోటారుసైకిళ్ళమీద అతడు, సబ్ ఇన్‌స్పెక్టరు బయల్దేరారు.

అసలా మోటారుసైకిళ్ళెవరివీ, యే కండిషన్‌లో ఉన్నాయో అని కూడా వారాలోచించలేదు.

ఇతర పరివారంలో కొందరు టెలిఫోన్ చేయాలనీ, కొందరు దగ్గర్లో వున్న పోలీసుస్టేషన్‌కి అలా బయల్దేరారు.

కొందరు శవం దగ్గర కాపలాగా వుండిపోయారు.

అక్కడ చేరిన జనం మాత్రం జరిగిందేమిటో అర్థం కాక—ఆశ్చర్యంగా అలా చూస్తూ నిలబడిపోయారు.

3

జీపులో కిల్లర్.....

జీపు వెనుక మోటార్ సైకిల్స్....

ఇలాంటి పరిస్థితి యెదురౌతుందని కిల్లర్ అనుకోలేదు.

ఎప్పుడూ పోలీసులకు పట్టుపడే తానీరోజు వాళ్ళకు భయపడి పారిపోతున్నాడు.

తాను చిక్కుకున్న మాయాజాలమేమిటో అతడికి తెలియదు. దాన్నుంచి యెలా తప్పించుకోవాలో అతడికి తెలియదు.

ముందుగా తాను స్వతంత్రుడు కావాలి.

అదే అతడి ఆలోచన....

జీపు శరవేగంతో దూసుకుపోతోంది.

కిల్లర్‌కా వీధులట్టే తెలియవు.

కనబడిన సందుల్లోకి జీపుని తిప్పేస్తున్నాడు.

మోటారుసైకిళ్ళతన్ననుసరించి వస్తూనే వున్నాయి.

ఆ విధంగా కిల్లర్ ఓ సందులోకి మలుపు తిప్పాడు.

మోటారు సైకిళ్ళు మలుపు తిరగడానికి కొద్ది క్షణాల వ్యవధి వుంది.

కిల్లర్ డ్రైవింగ్ సీటులోంచి రబ్బరు బంతిలా పక్కకు దూకాడు.

పక్కన చిన్న యిల్లుంది. ఇంటి తలుపులు దగ్గరగా వేసి వున్నాయి.

ఒక్క క్షణంలో కిల్లర్ తలుపు తీసుకుని ఆ యింట్లో ప్రవేశించాడు.

లోపల అతనికెవ్వరూ కనబడలేదు.

కిల్లర్ తలుపులు దగ్గరగా వేసి సందులోంచి బయటకు చూశాడు.

రెండు మోటారు సైకిళ్ళు వీధిలోంచి దూసుకుని పోతాయి.

కిల్లర్ తృప్తిగా నిట్టూర్చి తలుపుకు గడియ వేశాడు.
ఏం జరుగుతుందో అతడికి తెలుసు.

డ్రైవరు లేకుండానే జీపు తిన్నగా పోతోంది.

వీధి చాలా పొడుగైనది.

వీధి చివర జీపు గోడను గుద్దుకుంటుంది.

అప్పుడు పోలీసులకసలు విషయం తెలుస్తుంది

ఏం జరిగిందీ అని ఆలోచిస్తారు — ఏం జరిగిందో స్ఫురించకపోగా.

తాము చూస్తూండగా జీపులోంచి డ్రైవరు బయటకు దూకలేదు

ఏ యింటినుంచి జీపు తమ దృష్టిలో వున్నదీ వారంచనా వేస్తారు.

సోదా ప్రారంభిస్తారు.

ఈలోగా....

"ఎవరు నువ్వు?" అన్నదో గొంతు.

కిల్లర్ వెనక్కు తిరిగాడు.

అందమైన యువతి. మనిషి పొడుగ్గా వుంది.

అప్పుడే స్నానం చేసి వస్తోందేమో — వంటికి టర్కిష్ టవలు చుట్టుకుని వుంది.

కనబడుతున్న వంటిమీద నీటిబిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి.

ఆమె పొడవైన మనిషి కావడంవల్ల — తువ్వాలు శరీరంలో చాలా తక్కువ భాగాన్ని మాత్రమే దాచ గలిగింది.

అంగుళల్ల ఆమె చాలా ఆకర్షణీయంగా వుంది.

"ఇంటి తలుపులు వేసుకోకుండా స్నానానికి వెళ్ళావు. నీ గురించి తెలుసుకోవాలని వచ్చాను—" అన్నాడు కిల్లర్.

ఆమె ముఖం అదోలాగై పోయింది.

"ఇక్కడ మావారు కూర్చుని వుండాలి...." అందామె.

"మీవారా?" అన్నాడతడు — "నేను వచ్చేసరికి యెవరూ లేరు...."

ఆమె ముఖంలో భయం కనబడింది — "ఎందుకో బయటకు వెళ్ళి వుంటారు. ఇప్పుడు నన్నూ నిన్నూ ఇలా చూస్తే పెద్ద గొడవవుతుంది—" అందామె.

కిల్లర్ యేదో అనేలోగా యెవరో తలుపు తట్టారు.

కిల్లర్ ఆ యువతిని సమీపించి — "నావల్ల నీకేమీ ప్రమాదముండదు. నన్ను పోలీసులు తరుముతున్నారు. లోపల నేను దాక్కుంటాను. వచ్చింది పోలీసులే

అయిపోతారు. నా గురించి వాళ్ళడుగుతారు. ఏమీ తెలియదని చెప్పు అప్పుడు నేను నీ భర్తకు తెలియకుండా ఈ యిల్లొంచి వెళ్ళిపోతాను.... లేమా...." అని అర్థోక్తిలో ఆగి ఆమె బదులుకోసం యెదురుచూడకుండా లోపలకు వెళ్ళాడు.

తలుపు మళ్ళీ యెవరో తట్టారు.

"ఎవరూ?" అందామె.

"నేను—రమా!" అన్నదతని గొంతు.

"మీతో ఇంకెవరైనా వున్నారా?"

"లేరు...."

రమ చప్పుడు కాకుండా గడియతీసి, బాగా వెనక్కి వెళ్ళి—"తలుపు తీశాను...." అంది గట్టిగా.

బయటిన్నుంచి ఓ పొడుగాటి వ్యక్తి లోపలకు వచ్చాడు. ఏదో అనబోయి రమను చూసి ఆగిపోయాడు.

"అలా చూడకండి. ముందు వీధి తలుపులు వేయండి" అంది రమ.

అతడప్రయత్నంగా తలుపులు వేశాడు — "చాలా బాగున్నావు—" అన్నాడు.

"మీరు చేసిన పనేమీ బాగోలేదు...." అంది రమ.

"సారీ రమా! అనుకోకుండా సందులోకి వెళ్ళాను" అన్నాడతడు.

"ఎందుకు?" అందామె.

"నీకు తెలుసు!" అన్నాడతడు.

రెండ్రోజుల క్రితం రెండవ ఆట సినిమాకు వెళ్ళి భార్యాభర్తలిద్దరూ తిరిగివస్తూండగా రమకు దొరికింది ఒక గాజు.

అది బంగారపు గాజు. కనీసం రెండు కాసుల బరు

వుంటుంది.

ఆ గాజెవరిదో కూడా రమ వెంటనే గుర్తుపట్టింది.

ఆ వీధిలోనే వుండే కామాక్షమ్మదా గాజు.

కామాక్షమ్మకు ఒంటినిండా బంగారం. వీధిలో చాలా మంది ఆమెను చూసి అసూయపడుతూంటారు. వారిలో రమ కూడా ఒకతె!

“కామాక్షమ్మ గట్టిది. గాజెలా పారేసుకుందో!” అంది రమ.

“పారేసుకుని వుండదు. దొంగలు పడివుంటారు. బహుశా ఇది దొంగాడు పారేసుకుని వుంటాడు—” అన్నాడు రమ భర్త.

అది నిజమేనని మర్నాడు తెలిసింది.

దొంగలు కామాక్షమ్మింట్లో ప్రవేశించి—అందరికీ మత్తుమందుతో స్పృహ పోగొట్టి నిలువు దోపిడీ చేసి పోయారు.

ముందు రమ గాజును వెనక్కిచ్చేయాలనుకుంది. కానీ అందువల్ల లేనిపోని యిబ్బందులొస్తాయని భర్త భయపడ్డాడు. ఆ గాజును వారు తాత్కాలికంగా ఇంటి పక్క సందులో దాచారు—ఒక రాత్రిపూట.

ఆ సందులోకి జనం వెళ్ళడం అరుదు. అయినా రమ భర్త అప్పుడప్పుడా గాజును చూసుకుని వస్తూంటాడు. ఇంట్లో దాచాలంటే భయం.

భార్య స్నానానికి వెళ్ళినప్పుడతడు గాజు చూడ్డానికి వెళ్ళాడు.

“దీనికైనా సమయముంటుంది. నేనేమో బాత్రూంలో ఉన్నాను. అలాంటి సమయంలో ఇట్లో యెవరైనా చొరబడితే—....” అంది రమ.

"నా యింట్లో నేను లేకుండా యెవరూ చొరబడరు. నిన్ను మాత్రం ఇలా చూస్తుంటే చాలా బాగున్నావు" అంటూ భర్త రమను సమీపించాడు.

భర్త చొరవతీసుకుంటాడని రమ ఊహించింది. అయితే ఇంట్లో వేరే మనిషి వున్న విషయం భర్తకు తెలియదు. చెప్పలేదు.

"నేను పక్క గదిలోకి వెడతాను. నా బట్టలు తెచ్చి పెట్టండి—" అందామె.

"ఏం బెడ్రూంకి వెళ్ళి కట్టుకోవచ్చుగా–" అన్నాడు భర్త.

బెడ్రూంలోనే కిల్లర్ వున్నాడు. రమ ఏం చెప్పాలో ఆలోచిస్తూండగా యెవరో వీధి తలుపు తట్టారు.

రమ చటుక్కున బెడ్రూంలోకి వెళ్ళింది.

అక్కడ ఆమెకు కిల్లర్ కనబడలేదు.

ఏ బీరువా వెనకో, మంచంకిందో—ఆ గదిలోనే ఉండివుంటాడు కిల్లర్.

అందుకే రమ బట్టలు మార్చుకోలేదు. టర్కిష్ టవల్‌ను వంటిచుట్టూ మరింత గట్టిగా బిగించుకుంది.

ఆమె అలా నిలబడి వుండగానే యెంత వారిస్తున్నా వినిపించుకోకుండా—ఇన్‌స్పెక్టరూ, సబ్ ఇన్‌స్పెక్టరూ లోపలకు వచ్చారు.

రమను తువ్వాలు ధరించి వుండగా చూసి తెల్లబోయి "సారీ!" అన్నారిద్దరూ యేక కంఠంతో.

ఆ తర్వాత పోలీసులిద్దరూ ఇల్లు వెదకకుండానే వెళ్ళిపోయారు.

పోలీసులు వెళ్ళగానే రమ భర్త లోపలకు వచ్చి—

"ఎప్పటికీ బట్టలు మార్చుకోవేం? ఒళ్ళు కావరంగా

వుందా?" అన్నాడు.

రమ మాట్లాడకుండా స్టాండుమీద బట్టలు తీసుకుని పక్క గదిలోకి వెళ్ళింది.

"ఏమయింది నీకీ రోజు?" అంటూ భర్తామె ననుస రించాడు.

"నాకు మరీ దగ్గరగా రాకండి. రాకుండా వుండ లేననుకుంటే స్నానం చేసి రండి—" అంది రమ.

అతను వెంటనే స్నానానికి వెళ్ళాడు.

తప్పించుకు నేందుకు కిల్లర్ కా సమయం చాలు.

అతడిలా సమయమివ్వాలనే రమకూడా అనుకుంది.

కిల్లర్ తన బట్టలు విప్పి మంచం కిందకు తోశాడు.

స్టాండుమీద రమ భర్త లుంగీ ఒకటి వేసుకున్నాడు. పైన లాల్చీ ధరించి ఇల్లోంచి బయటకు వెళ్ళిపోయాడు.

ముందుగా అతడు మొబైల్ వ్యాన్ దగ్గరకు వెళ్ళాడు. లోపల పూర్తిగా వేషం మార్చుకుని-బట్టలు మార్చుకుని బయటకు వచ్చాడు.

పోలీసులవద్ద తన ఫోటో వుంది. ఆ ఫోటోకి ప్రచారం లభిస్తే తన మొబైల్ వ్యాన్ మీద అందరి దృష్టి పడుతుంది.

ఈలోగా తను దారి వెతుక్కోవాలి.

కిల్లర్ మొబైల్ వ్యాన్లో రామేశ్వరమూర్తి ఇంటికి వెళ్ళాడు.

రామేశ్వరమూర్తి కిల్లర్ వలన ప్రయోజనం పొందిన భాగ్యవంతుడు.

ఆయన కిల్లర్ ద్వారా జరిగిందంతా విన్నాడు.

"మీ వ్యాన్ — నా గ్యారేజిలో రహస్యంగా దాచ బడుతుంది. మీరు విశ్రాంతిగా వుండండి—" అన్నాడు

రామేశ్వరమూర్తి.

కిల్లర్ నిట్టూర్చి ఆయనవద్ద శలవు తీసుకున్నాడు.

4

విశాల ప్రపంచంలో యేకాకిగా తిరుగుతున్నట్లుంది కిల్లర్ కి.

ఇలాంటి పరిస్థితి అతడికెప్పుడూ ఏర్పడలేదు.

చట్టం దృష్టిలో తాను హంతకుడు.

హంతకురాలు సుజాత.

ఆమె యెవరో అతడికి తెలియదు.

తానిపుడు విల్సన్ ని పట్టుకొని సాధించాలి.

విల్సన్ యెవరో ఎక్కడుంటాడో అతడికి తెలియదు.

ఎలా వుంటాడో మాత్రం తెలుసు.

విల్సన్ గురించి తెలుసుకోవాలంటే సుజాత గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలి. అందుకు తన మారు వేషం బాగా సహకరిస్తుంది.

ఎందుకైనా మంచిదని ఆ రోజు అతడు సుజాత వుండే వీధికి వెళ్ళలేదు.

మర్నాడు మధ్యాహ్నం మండుటెండలో అతడా వీధిలోకి వెళ్ళాడు.

మళ్ళీ ఆ వీధి నిర్మానుష్యంగానే వుంది.

ఎవరింటికి వెళ్ళాలా అని ఆలోచిస్తూ కిల్లర్ నడుస్తూండగా సుజాత ఇంటిముందు మాటలు వినిపించాయి.

చటుక్కున పక్కకు తిరిగాడతడు.

సుజాత ఇంటికి తాళం వేసివుంది. గుమ్మం దగ్గర కూర్చుని వున్నాడు సెంట్రీ.

ఒక వ్యక్తి సెంట్రీని సుజాత గురించి అడుగుతున్నాడు.

సెంట్రీ అతడికి ఆమె హత్య గురించి చెప్ప—

"మీకామెతో ఏమిపని?" అన్నాడు.

అతడు జేబులోంచి పాతిక రూపాయలు తీసి — "ఇవి నేనామెకు బాకీ వున్నాను. మంచి అవసరంలో ఈ డబ్బిచ్చి నన్నాదుకుందామె. పుణ్యాత్మురాలు. ఇలా యింతో మందిని ఆదుకుంది. డబ్బు తిరిగివ్వాలని వచ్చాను. ఈ డబ్బు ఆమె పేరు చెప్పి నువ్వే వుంచుకో.... ఆమె ఆత్మకు శాంతి కలుగుతుంది—" అని వెనక్కి తిరిగాడతడు.

అతడెవరో సుజాతకు బంధువయుండాలి. ఆమె హత్య గురించి ఆ బంధువుకి తెలిసి వుండదు. రాగానే సెంట్రీ ద్వారా విషయం తెలుసుకున్నాడు. హత్య కేసులో సాక్షిగా ఇరుక్కోవాలని భయపడ్డాడు. ఏదో వంకన సెంట్రీకి పాతిక రూపాయలిచ్చి తప్పించుకోవాలనుకుంటున్నాడు. పాతిక రూపాయలు సెంట్రీకి తక్కువ మొత్తంకాదు.

తనా వ్యక్తి ననుసరించాలనుకున్నాడు కిల్లర్.

అయితే వెనక్కి తిరిగిన ఆ వ్యక్తిని చూసి తెల్లబోయాడతడు.

అతడు విల్సన్!

విల్సన్ సుజాతను హత్యచేశాడు. మళ్ళీ యెందుకొచ్చాడు?

ఇంటికి పోలీసు కాపలా వుంటుందని అతడూహించలేడా?

కిల్లర్ తను కూడా సుజాత ఇంటివైపు నడిచి సెంట్రీని పలకరించి — "రామాలయం వీధి అంటే ఇదేనా?" అనడిగాడు.

"ఊరికి కొత్తలాగున్నావు. రామాలయం వీధి ఊరికి

ఆ చివరుంది. నువ్వే చివర్లో వున్నావు—" అని నవ్వాడు సెంట్రీ.

కిల్లర్ కంగారుపడ్డవాడిలా వెనక్కి తిరిగాడు.

ఆ తర్వాతనుంచి విల్సన్‌ని అనుసరించసాగాడు.

విల్సన్ వెనక్కి తిరక్కుండా ముందుకు వెళ్ళిపోతున్నాడు.

కిల్లర్ మెదడులో రకరకాల ఆలోచనలు....

విల్సన్ తన్ను చూశాడా? గుర్తుపట్టాడా?

అసలతడు మళ్ళీ సుజాతింటికెందుకు వచ్చాడు?

కిల్లర్ ఆలోచనల్లో ప్రశ్నలేకాని జవాబులు లేవు.

విల్సన్ కాలినడకనే ముందుకు చూసుకొని వెళ్ళిపోతున్నాడు.

అలా యిద్దరూ చాలాదూరం వెళ్ళారు.

మండుటెండ కిల్లర్ని రోజూ బాధించడంలేదు.

అతడి ఆలోచనలనిండా విల్సన్....

కిల్లర్ చూస్తూండగా విల్సన్ ఓ హోటల్లోకి దూరాడు.

కిల్లర్ కూడా ఆ హోటల్లోకి వెళ్ళాడు.

విల్సన్ ఓ సీట్లో కూర్చున్నాడు.

కిల్లర్ తనకు విల్సన్ కనబడేలా ఓ సీట్లో కూర్చున్నాడు.

సర్వర్ విల్సన్ దగ్గరకు వెళ్ళాడు.

కిల్లర్ జరుగుతున్నది చూస్తున్నాడు.

ఏదో రహస్యం వింటున్నవాడిలా సర్వర్ విల్సన్ వైపు వంగాడు.

విల్సన్ అతడి చెవిలో యేదో చెప్పాడు.

సర్వర్ తలాడించి లోపలకు వెళ్ళిపోయాడు.

కిల్లర్‌కి చాలా ఆశ్చర్యమయింది.

విల్సన్ సర్వర్ చెవిలో ఏం చెప్పాడు?

అతడు తన్ను గమనించాడా? లేక సర్వర్ అతడికి తెలుసా?

ఎందుకో అంతవరకూ తనను విల్సన్ గమనించి వుండడం చేత కిల్లర్‌కి నమ్మకం కుదరడం లేదు.

"ఏం కావాలి సార్!" అన్న గొంతు వినబడి ఈ లోకానికి వచ్చాడు కిల్లర్.

ఎదురుగా సర్వర్!

సర్వర్ చేతిలో ట్రే వుంది. ట్రేలో మంచినీళ్ళ గ్లాసులు మొత్తం మూడున్నాయి.

సర్వర్ మూడు గ్లాసులూ టేబిల్ మీద పెట్టాడు.

అప్పుడు చూశాడు కిల్లర్.

అతడికెదురుగా మరో ఇద్దరు వ్యక్తులు కూర్చుని వున్నారు.

వాళ్ళతడివంకే పరీక్షగా చూస్తున్నారు.

వాళ్ళ చూపులు కిల్లర్‌కి మామూలుగా అనిపించలేదు. అయినప్పటికీ చూపులు కలవడంవల్ల పలకరింపుగా నవ్వాడు.

వాళ్ళిద్దరూ ఇబ్బందిగా నవ్వి చూపులు మరల్చుకున్నారు.

"ఏం కావాలి సార్?" సర్వర్ మళ్ళీ అడిగాడు.

"మసాలాదోశ!"

వాళ్ళిద్దరూ కూడా సర్వర్‌కి మసాలాదోశలే ఆర్డరిచ్చారు.

తన మాటలే ప్రతిధ్వనించినట్లు ఫీలయ్యాడు కిల్లర్.

కానీ వాళ్ళిద్దరూ ఇప్పుడతడివంక చూడ్డంలేదు.

కిల్లర్‌కి దాహంగా వుంది.

మండు టెండలో నడిచి వచ్చాడు.

ఓరకంట విల్సన్‌ని గమనిస్తూనే అతడు మంచినీళ్ళ గ్లాసందుకున్నాడు. ఒక గుక్కెడు నీళ్ళు తాగాడు. గొంతులో హాయిగా అనిపించింది.

వేసవిలో చల్లని నీరు అమృతప్రాయం.

గ్లాసుడు నీళ్ళూ తాగేశాడు కిల్లర్.

అతడి యెదుట కూర్చున్నవారిద్దరూ మళ్ళీ కిల్లర్నే శ్రద్ధగా గమనించసాగారు.

కిల్లర్ కుర్చీలో వెనక్కి వారగిలబడ్డాడు. ఓరకంట విల్సన్ని గమనిస్తూ కళ్ళు మూసుకున్నాడు.

కొద్ది క్షణాల్లో అతడి తల పక్కకు వాలిపోయింది.

అప్పుడతడి ముందున్న వ్యక్తు లిద్దరూ లేచి నిలబడ్డారు. కిల్లర్ని సమీపించారు.

కిల్లర్ కుర్చీలో నిద్రపోతున్నవాడిలా వున్నాడు.

వారతణ్ని కదిపారు.

కిల్లర్ లేవలేదు.

ఇంతలో సర్వర్ అక్కడికి వచ్చాడు—"ఏం జరిగింది?" అన్నాడు.

"మా స్నేహితుడి ఆరోగ్యం బాగోలేదు. వద్దంటూంటే హోటలుకు వచ్చాడు. ఎందుకో కళ్ళు తిరిగాయి. అర్జంటుగా హాస్పిటలుకు తీసుకువెళ్ళాలి. దోవెల ఆర్డరు కాన్సిల్!" అన్నాడు వారిలో ఒకడు.

"అయ్యో! ముందతణ్ని అర్జంటుగా హాస్పిటలుకు తీసుకొని వెళ్ళండి—" అన్నాడు సర్వర్.

ఈ సంభాషణ అక్కడ చాలామంది విన్నారు.

ఏమిటేమిటంటూ వారిచుట్టూ మూగారు.

ఆ యిద్దరూ జనాలకు విషయం చెప్పుకుంటూ కిల్లర్ని బయటకు తీసుకొని వెళ్లారు. ఇద్దరు మనుషులకు కిల్లర్ భారంగానే వుండడంవల్ల సర్వర్ కూడా ఓ చేయి వేశాడు.

కిల్లర్ నడవడంలేదు.

అందుకని వాళ్ళతణ్ని ఇంచుమించు ఈడ్చుకుంటూ వెళ్లారు.

విల్సన్ అటువైపు కూడా చూడలేదు. ఏం జరిగిందీ పట్టించుకోలేదు.

అతడికి ఊతప్పం వచ్చింది. అది తింటున్నాడు.

హోటల్లోని కొందరు జనం బయటకు వెళ్ళారు.

కిల్లర్ ఓ టాక్సీలోకి తరలించబడ్డాడు. జనంవైపుకు ఆ యిద్దరిలో ఒకడు తిరిగాడు-"మీ సహాయానికి చాలా థాంక్స్!" అన్నాడు.

"మేమేం చేశాం—" అన్నాడు జనంలో ఒకడు.

"జరిగిందంతా చూశారు. అందుకు!" అన్నాడా యిద్దరిలో ఒకడు.

"అయితే?"

"అనవసరపు ప్రశ్నలతో విసిగించలేను. చూసి ఊరుకున్నారు...." అంటూ అతడు టాక్సీ యెక్కాడు.

టాక్సీ రివ్వున దూసుకుని పోయింది.

విల్సన్ తాపీగా ఊతప్పం తింటూ ఓసారి తనలో తను నవ్వుకున్నాడు.

5

ఉన్నట్టుండి మెలకువవచ్చి చటుక్కున లేచి కూర్చున్నాడు కిల్లర్.

గదిలో ప్లాస్టిక్ నవారు స్టీలు మంచంమీదున్నాడు

తను.

పైన ఫ్యాను తిరుగుతోంది.

కిల్లర్ ఓసారి కళ్ళు మూసుకొని ఏం జరిగిందో గుర్తు చేసుకుందుకు ప్రయత్నించాడు.

అంతా గుర్తొచ్చింది.

హోటల్లో మసాలాదోశ ఆర్డరిచ్చాడు తాను. తిన్న గుర్తులేదు.

ఇక్కడికెలా వచ్చాడు?

కిల్లర్ లేచి గదంతా కలయతిరిగాడు.

మొజాయిక్ ఫ్లోరింగ్ నున్నగా వుంది. అతడి బూట్లు నేలపై జారిపోతున్నాయి.

కిల్లర్ గది గుమ్మందాకా వెళ్ళాడు. తలుపు తీయబోయాడు.

రాలేదు.

అప్పుడతడు తలుపులు దబదబా బాదాడు.

కొద్దిక్షణాల్లో తలుపులు తెరుచుకున్నాయి.

గుమ్మంలో అవతల ఓ వ్యక్తి నిలబడి వున్నాడు.

అయిదడుగుల మూడంగుళాల పొడవు....

పొడవుకు తగ్గ పన్నం....

మనిషికి ముప్ఫై యేళ్ళపైనుండొచ్చు. కానీ ముఖంలో పసితనం కనపడుతోంది.

చూపుల్లో మాత్రం పరిణతి వుంది.

అతడు కిల్లర్ని చూసి నవ్వాడు.

ఆ నవ్వు అంతర్జాతీయ స్మగ్లర్స్‌కే సాధ్యపడుతుంది. కోల్డు బ్లడెడ్ స్మైల్ అది!

"మెలకువొచ్చిందా?" అన్నాడతడు.

"ఎవరున్నువ్వు?" అన్నాడు కిల్లర్.

"చూపులకు చిన్నవాణ్ని. చేతలకు పెద్దవాణ్ని. నా పేరు ప్రస్తుతానికి విసిల్ అనుకో—" అన్నాడతడు నవ్వుతూ.

నవ్వకపోతే అతడు పసిబాలుడిలా వున్నాడు.

నవ్వినప్పుడు అంతర్జాతీయ స్మగ్లర్లా వున్నాడు.

"మిస్టర్ విసిల్—నాతో నీకేం పని?" అన్నాడు కిల్లర్.

"నిజానికి నీతో నాకేపనీ లేదు. కానీ నువ్వే పని కల్పించావు...."

"నేను కల్పించానా?" అన్నాడు కిల్లర్ ఆశ్చర్య పోతూ.

"నా వ్యాశ్చర్యపోతే నువ్వు చాలా మంచి నటుడివని తెలుసుకుంటాను.... బయటకురా — నీతో చాలా మాట్లా డాలి!" అన్నాడు విసిల్.

కిల్లర్ బయటకు వచ్చాడు.

అదొక చిన్న హాలు.

నేలంతా కార్పెట్ పరిచివుంది.

మధ్యలో సోఫా!

గోడలకు ఖరీదైన పెయింటింగ్స్....

ఇద్దరూ సోఫాల్లో యెదురెదురుగా కూర్చున్నారు.

ఇద్దరికీ మధ్య టీపాయ్ వుంది.

టీపాయ్ మీద చిన్న ప్లాస్టిక్ డబ్బా వుంది.

విసిల్ సోఫాలో వెనక్కు జారగిలబడి—"నేను నిన్నో ప్రశ్న అడుగుతాను. సూటిగా జవాబు చెప్పాలి" అన్నాడు.

"అడుగు—" అన్నాడు కిల్లర్.

"ఎవర్నువ్వు?" అన్నాడు విసిల్.

అంతవరకూ అతడి గొంతు ఒక విధంగా వుంది. అప్పుడు మరోలా ధ్వనించింది. కోల్డు బ్లడెడ్ వాయిస్ అది!

"నీవెవరో తెలియకుండా నీ ఇక్కడికి రప్పించావా?" అన్నాడు కిల్లర్.

"తెలుసుకుందుకే ఇక్కడికి రప్పించాను" అన్నాడు విసీల్.

"నా గురించి తెలుసుకోవాల్సిన అవసరం నీకేముంది?" అన్నాడు కిల్లర్.

"నా ప్రశ్నలకు జవాబు చెప్పడం నీ బాధ్యత— ముందు నువ్వెవరో చెప్పు. చెప్పకపోతే....?" అని ఆగాడు విసీల్.

"చెప్పకపోతే?" కుతూహలంగా అడిగాడు కిల్లర్.

విసీల్ ముందుకు వంగి ప్లాస్టిక్ డబ్బా మూతతీశాడు.

కిల్లర్ ఉలిక్కిపడ్డాడు.

టీపాయ్ మీదున్న ప్లాస్టిక్ డబ్బాలోంచీ బుస్సుమంటూ నల్లటి తాచుపాము పడగఎత్తి ఆడుతోంది.

తాచుపాము అటూ ఇటూ కదుల్తోంది. డబ్బాలోంచి బయటకు రావడంలేదు.

"ఏమిటిది?" అన్నాడు కిల్లర్.

"ఈ పాము కాటేస్తే సెకన్లో వెయ్యోవంతులో మనిషి ప్రాణం పోతుంది—...."

కిల్లర్ తేలిగ్గా నవ్వి—"ఇంతవరకూ ఇది నిన్ను కాటేయలేదా?" అన్నాడు.

"ఇది నా పెంపుడు పాము. నన్ను తప్ప ఎవరినైనా కాటేసుంది...."

కిల్లర్ తాచుపాము వంకే చూస్తున్నాడు. అది

తమాషాగా అనుతోంది....

"నా పేరు కిల్లర్. నేనొక ప్రయివేటు డిటెక్టివుని" అన్నాడు కిల్లర్.

"వెరీగుడ్ ....ఇంకా చెప్పు...."

"నన్ను చంపాలనుకుంటే మనుషుల్ని లెక్క చేయను. ఇంతవరకూ నన్ను చంపాలనుకున్నవారందరూ చచ్చారు. ఆ విషయం నీ పెంపుడు పాముకు అర్థమయ్యేలా చెప్పు.."

"నా పెంపుడు పాముకు చావులేదు—" అన్నాడు వినీల్.

"పుట్టిన ప్రతి జీవికీ చావుంటుంది...."

"జీవికి చావుంటుంది. కానీ యంత్రానికి కాదు...."

"అంటే?"

వినీల్ వివరించాడు. ఎదురుగా ప్లాస్టిక్ డబ్బాలో వున్న పెంపుడు పాముకు ప్రాణంలేదు. కానీ తుపాకీ గుళ్ళకూ, ప్రేలుడు పదార్థాలకూ లొంగని ప్రత్యేకమైన పాలిమర్స్‌తో తయారుచేయబడిందది. తనలో జీవం లేక పోయినా జీవమున్న వారి జీవాలు హరించగల విషం దానిలో వుంటుంది.

ఆ పాము ఎదుట వుండగా వినీల్‌ని తనేమీ చేయలేడని కిల్లర్ గ్రహించాడు.

"వెరీగుడ్! హేట్సాఫ్ టూ యువర్ డిస్కవరీ!" అన్నాడు కిల్లర్.

"పాగ డంతో నిన్ను నీవు రక్షించుకోలేవు—...." అన్నాడు వినీల్.

"పోనీ—ఎలా రక్షించుకోగలనో చెప్పు—...." అన్నాడు కిల్లర్.

"తాళపత్ర గ్రంథాలు నాకిచ్చేస్తే నీ ప్రాణాలు రక్షించబడతాయి...."

"తాళపత్ర గ్రంథాలేమిటి?" అన్నాడు కిల్లర్.

"సుజాత ఇంట్లోంచి నువ్వు తీసుకున్నవి...."

కిల్లర్ ఆశ్చర్యపోయి — "సుజాత నీకు తెలుసా?" అన్నాడు.

"ఊఁ! సుజాత నా మనిషి!" అన్నాడు వినీల్.

"పాపం — ఆమె చచ్చిపోయింది...." అన్నాడు కిల్లర్.

"నువ్వే ఆమెను చంపేశావ్!" అన్నాడు వినీల్.

"ఎవరు చెప్పారు నీకు?"

వినీల్ చప్పట్లు కొట్టాడు.

అప్పుడు దూరాన్నుంచి ఓ నల్లటి మనిషి వచ్చాడు. అతడు ఆరడుగుల ఎత్తులో కండలు తిరిగి బలిష్టంగా వున్నాడు.

అతడి చూపుల్లో క్రూరత్వం తప్ప మరో భావం లేదు.

ఆ వ్యక్తి వినీల్‌ని సమీపించి దగ్గరగా వంగాడు.

వినీల్ అతడి చెవిలో ఏదో చెప్పాడు. ఆ మనిషి వెళ్ళిపోయాడు.

"ఎవరతడు?" అన్నాడు కిల్లర్.

"ఈ యింటి కాపలావాడు. ఇంట్లోంచి నన్ను తప్ప యెవర్నీ నా అనుమతి లేకుండా బయటకు వెళ్ళనివ్వడు."

"నేను వెడతానంటే ఏం చేస్తాడు?"

"వద్దంటాడు...."

"వినకపోతే?"

"వారిస్తాడు...."

"లెక్క చేయకపోతే?"

"చంపేస్తాడు...." చాలా తాపీగా అన్నాడు విసీల్.

"చంపలేకపోతే?"

"నాకు తెలియదు...."

"తెలుసుకోవడం మంచిది...." అన్నాడు కిల్లర్.

"తెలుసుకోవాలని నాకూ వుంది. కానీ నాకా అవకాశం రావాలి కదా! ఇంతవరకూ ఈ యింటినుంచి పారిపోవాలని ప్రయత్నించినవారు ముగ్గురు. ముగ్గురికి ముగ్గురూ చచ్చారు...."

కిల్లర్ యేదో అనాలనుకున్నాడు. ఈలోగా అతడు వచ్చాడు. అతడి చేతిలో పేపరుంది.

విసీల్ పేపరు తీసుకుని అతణ్ని వెళ్ళిపొమ్మని సైగ చేశాడు.

అతడు వెళ్ళిపోయాడు.

విసీల్ పేపర్ని కిల్లర్ కిచ్చాడు.

టీపాయ్ మీది తాచుపాము ముందు విసీల్ వైపుకి వంగింది. అతడి చేతిలోని పేపరు చేతులు మారుతూంటే తనూ పేపరుతోపాటు కిల్లర్ వైపు వంగింది.

కిల్లర్ దాన్ని గమనిస్తూనే ఉన్నాడు.

సెకండ్లో వెయ్యోవంతు చాలు — ప్రాణం పోవడానికి!

అతడు పేపరు చూశాడు.

మొదటి పేజీలో అతడి బొమ్మ. బొమ్మకింద వివరాలను బట్టి అతడు పారిపోయిన హంతకుడు.

"సుజాత మా మనిషి. మాదొక అంతర్జాతీయ ముఠా. ఆమె మాకు కావలసిన కీలకమైన రహస్యాలు తెలుసుకుని వాటిని తాళపత్రగ్రంథాల రూపంలో పొందుపరుస్తోంది.

ఎవరికీ అనుమానం రాకుండా వుండడంకోసం ఆమెవద్ద పురాతన తాళపత్రగ్రంథాలు కూడా కొన్ని వున్నాయి. ఇటీవల ఆమె కొన్ని ముఖ్య రహస్యాలు తెలుసుకుంది. వాటిని విల్సన్ అనబడే మరో మా మనిషికందజేయాలి. ఆమె అందజేసే తాళపత్రగ్రంథాల విలువ నలభైకోట్ల రూపాయలు. అంతర్జాతీయంగా అందరూ పంచుకోగా-నా ఒక్కడికే దేశ్ లక్షల రూపాయలు వస్తుంది. అంత విలువైన వాటిని నువ్వు — విల్సన్‌కంటే ఒకరోజు ముందే దక్కించుకున్నావు....” అన్నాడు వినీల్.

“ఇప్పుడు నాకు కొంత కథ అర్థమవుతోంది—” అన్నాడు కిల్లర్.

తాచుపాము టీపాయ్‌మీద ఆడుతోంది.

“వెరీగుడ్ —నీకర్థమయిందేమిటో చెప్పు-” అన్నాడు వినీల్.

“విల్సన్ సుజాతనెందుకు చంపాడా అని ఆలోచిస్తున్నాను. ఇప్పుడసలు కథ తెలిసింది.”

“స్టాప్ నాన్సెన్స్!” కోపంగా అరిచాడు వినీల్.

టీపాయ్‌మీద తాచుపాము బుస్సుమంది.

“నేను నిజమే చెబుతున్నాను. పూర్తిగా విను....” అన్నాడు కిల్లర్..

వినీల్ కోపాన్ని నిగ్రహించుకొని—“ఊఁ చెప్పు-” అన్నాడు.

కిల్లర్ విల్సన్ తన్ను కలుసుకొని ఎలా ట్రాప్ చేసిందీ చెప్పాడు.

“ఇంపాసిబుల్!” అన్నాడు వినీల్.

“జరిగింది చెప్పాను. అసాధ్యమైతే నేనేం చేయను?”

"జరిగింది నేను చెబుతాను. శ్రద్ధగా విను—" అన్నాడు విసీల్.

"ఊఁ" అన్నాడు కిల్లర్.

"ఈరోజు విల్సన్ సుజాతను కలుసుకొని తాళపత్ర గ్రంధాలు సేకరించాలి. కానీ ఈ విషయం నీకెలాగో తెలిసింది. నిన్ననే వెళ్ళావు. సుజాతను హత్య చేశావు. తాళపత్రగ్రంధాలకోసం వెతకడంలో ఆలస్యం జరిగింది. పోలీసులు వచ్చారు. తప్పించుకొని పారిపోవాలను కున్నావు పారిపోయావు...."

"కానీ అదే నిజమనుకున్నా—తాళపత్రగ్రంధాలు నాకు చిక్కలేదు...."

"చిక్కకపోతే నేనాశ్చర్యపోను. కానీ ఆ విషయం ధృవపడడానికి నాకు వ్యవధి కావాలి. సుజాతింటికి ప్రస్తుతం పోలీసు కాపలా వుంది. అంతవరకూ నిన్ను నా బందీగా వుంచుకోక తప్పదు...." అని నవ్వాడు విసీల్- "ఈలోగా తప్పించుకోవాలనుకుంటే ఒకే ఒక్క ఉపాయం. తాళపత్రగ్రంధాలెక్కడ దాచిందీ నాకు చెప్పు...."

"ఆ విషయం నాకంటే విల్సన్ కే బాగా తెలుస్తుంది. ఇంతకీ నేను నీకెలా దొరికాను?"

"నీ ప్రవర్తనే నిన్ను పట్టిచ్చింది—" అన్నాడు విసీల్—"సుజాత హత్య గురించి మాకెవ్వరికీ తెలియదు. విల్సన్ మామూలుగా నిర్ణీత సమయానికి సుజాత ఇంటికి వెళ్ళాడు. అక్కడ శవంటీని చూసి ఆశ్చర్యపడ్డాడు. విషయం తెలిసేక అక్కణ్ణించి బయటపడ్డాడు. అప్పుడు నువ్వాణ్ణి అనుసరించడం మొదలుపెట్టావు. అయితే మాది అంతర్జాతీయ ముఠా. విల్సన్ హోటల్లో అడుగుపెట్టగానే

అతిడికే ప్రమాదమూ రాకుండా రక్షించడానికి నలుగురు అంగరక్షకులు కూడా బయల్దేరారు. వారు నిన్ను కని పెట్టారు. విల్సన్ కూడా నీ వ్యవహారం గమనించాడు. అందుకే హోటల్లోకి అడుగు పెట్టాడు.

అది మా ముఠా హోటలన్న విషయం నీకు తెలియదు. విల్సన్ సర్వర్ కి చెప్పి నీకిచ్చే మంచినీళ్ళలో మత్తుమందు కలిపించాడు. నా అనుచరులిద్దరు నిన్నిక్కడికి తీసుకుని వచ్చారు. మొదట నేను నిన్ను పోలీసుల మనిషని అనుమానించాను. తీరా చూస్తే నీది మారువేషమని తేలింది. సుజాత హత్య గురించిన ఆరా ఈలోగా కొంత తెలిసింది. నువ్వే ఆ హంతకుడివని తెలియగానే నా అదృష్టాన్ని నేనే అభినందించుకున్నాను—...."

మొత్తం జరిగినదంతా కిల్లర్ కర్థమయింది.

"ఇప్పుడు నాకంతా తెలిసింది. విల్సన్ నిన్ను మోసగించాడు...." అన్నాడు కిల్లర్.

"విల్సన్ వాడు నమ్మకమైన మనిషి. అతడు నన్ను మోసగించడు...."

"నమ్మినవాళ్ళే యెవరైనా మోసగించగలరు. ఆ తాళపత్రగ్రంథాలవల్ల నీకు డెబ్బైలక్షలు వస్తాయంటున్నావు. అందులో విల్సన్ భాగమెంత?" అన్నాడు కిల్లర్.

"యాభై వేలు...."

"చాలాకాలంగా ఈ వ్యవహారాలు తెలిసిన విల్సన్ యేం అయిదులక్షలకో ఆ తాళపత్రగ్రంథాలనమ్మేస్తే?"

విసీల్ ముఖంలో రవంత కలవరం కనపడింది—

"నువ్వు నాలో అనుమానబీజాలు నాటాలని చూస్తున్నావు. నిజానిజాలు తెలుసుకోగల లైడిటెక్టర్ నా

దగ్గరుంది—" అన్నాడతడు.

"అయితే యిటుం? నీ లైడిటెక్టర్‌తో విల్సన్‌ని పరీక్షించుకో—"

"నావాళ్ళని నేను పరీక్షించను. నువ్వు చెప్పేది నిజమో కాదో నా డిటెక్టర్ తెలుస్తుంది. నువ్వు నిజమే చెబితే విల్సన్ మోసం చేసినట్లు.... లేకుంటే...." అని ఆగాడు విసీల్.

"లేకుంటే?" అన్నాడు కిల్లర్.

"నా విషసర్పం నిన్ను కాటేస్తుంది...." అన్నాడు విసీల్.

కిల్లర్ ఒళ్ళు జలదరించింది.

విసీల్ మళ్ళీ చప్పట్లు కొట్టాడు.

నల్లటి ఆరడుగుల మనిషి వచ్చి విసీల్ అడిగిన ఓ చిన్న సాధనం తెచ్చి ఇచ్చి వెళ్ళిపోయాడు.

పాకెట్ టేపురికార్డంత సాధనం అది.

దానిపై పియానో మెట్లు మీటలు నాలుగున్నాయి.

విసీల్ ఒక మీట నొక్కగానే—దానిపై స్టీరియో కాసెట్టే డెక్స్‌లో వెలిగినట్లు ఒక పచ్చ చుక్క, ఒక ఎర్ర చుక్క వెలిగాయి.

విసీల్ కిల్లర్‌తో—"నువ్వు మాట్లాడ్డం ప్రారంభించు" అన్నాడు.

"ఏం మాట్లాడాలి?" అన్నాడు కిల్లర్.

అప్పుడే విసీల్ రెండవ మీటను నొక్కాడు—"ఇప్పుడిది నీ గొంతుకు అనుకూలంగా యింది. నువ్వేం మాట్లాడినా ఈ పరికరం వింటుంది. నువ్వు చెప్పేది నిజమైతే నీ స్వరానికి అనుగుణంగా వరుసగా ఆకుపచ్చ చుక్కలు మెరుస్తాయి. అబద్ధం చెబితే ఎర్రచుక్కలు

మెరుస్తాయి. హరిహరాదులెవరొచ్చినా, ఈ పరికరం అబద్ధమాడదు, తప్పుచేయదు. ఇప్పుడు నీ వివరాలు చెప్పు...."

కిల్లర్ ఆశ్చర్యంగా ఆ యంత్రంకేసి చూశాడు. ఒక్కక్షణమాగి—"నా పేరు వెంకన్న, నేనొక ప్రయివేటు డిటెక్టివును...." అన్నాడు.

అతడు వెంకన్న అనగానే పరికరంలో వరుసగా యేడు ఎర్రచుక్కలు వెలిగాయి. ప్రయివేటు డిటెక్టివనగానే వరుసగా ఏడు ఆకుపచ్చ చుక్కలు వెలిగాయి.

"పరికరాన్ని పరీక్షించినట్లున్నావు. అలాంటి పనులు చేయడంవల్ల నీకే ప్రమాదం. ముందు విల్సన్ గురించి చెప్పు. నువ్వు మాట్లాడేటప్పుడు ఎర్రదీపం వెలిగిందా—నా పెంపుడు పాము కాటందుకుంటుంది—" అంటూ పరికరానికి విల్సన్ మరో మీట నొక్కాడు.

"అంతే!

టీపాయ్‌మీద ఆడుతున్న తాచుపామిప్పుడు కిల్లర్ వైపు తిరిగింది.

అది అతడి నే గుచ్చి గుచ్చి చూస్తున్నట్లుంది.

కిల్లర్ దృష్టి ఇప్పుడు టీపాయ్‌మీద నే వుంది.

లైడిటెక్టర్; తాచుపాము—ఒకదానికొకటి పక్కన వున్నాయి.

మనిషి అబద్ధం చెప్పేటప్పుడతడికో విశేషం తెలుస్తుంది. తను అబద్ధం చెబుతున్నానన్న భావం అతడిని తడబడేలా చేస్తుంది. అప్పుడతడి నరాల కంపన వేరే విధంగా వుంటుంది. స్పందనగతులు మారతాయి అది మామూలు మనుషులు కనిపెట్టే తేడా కాదు. లైడిటెక్టర్లు ఈ సూత్రం ఆధారంగా పని చేస్తాయి. తన యెదుటనున్న

లైడిటెక్టర్ స్వరగతులనుబట్టి అబద్ధాలను తెలుసుకుంటుందన్నమాట!

కిల్లర్ కు అవసరపడినప్పుడబద్ధాలు చెప్పడంలో తానగ్రగణ్యుడినని నమ్మకం. తడబడకుండా అబద్ధాలు చెప్పగలననుకున్న అతడి నమ్మకాన్ని పరికరం అబద్ధం చేసింది. చాలా సునిశితమైన యంత్రమయుండాలది.

ఇప్పుడబద్ధం చెబితే తన ప్రాణాలకే ప్రమాదమని కిల్లర్ కి తెలుసు.

అతడు గొంతు సవరించుకొని గత దినం విల్సన్ తో తనకు జరిగిన అనుభవం చెప్పసాగాడు.

కిల్లర్ మాట్లాడుతూంటే లైడిటెక్టర్లో వరుసగా ఆకుపచ్చ చుక్కలు వెలిగి ఆరుతున్నాయి. ఆ చుక్కలతడి మాటలకనుగుణంగా నాట్యం చేస్తున్నట్టుంది. ఆ పక్కనే చుక్కల కనుగుణంగా తాచుపాము ఆడుతోంది.

కిల్లర్ జరిగింది జరిగినట్లు చెప్పడమయ్యేసరికి విసీల్ లో పెద్ద మార్పు వచ్చింది.

అతడు చప్పట్లు కొట్టాడు.

అరడుగుల నల్లనివాడు వచ్చాడు. విసీల్ అతడికేదో చెప్పాడు. అతడు వెళ్ళిపోగానే లైడిటెక్టర్ని ఆఫ్ చేశాడు.

కిల్లర్ తృప్తిగా నిట్టూర్చాడు.

“చూశావా— నేను నిజమే చెప్పాను. అనవసరంగా నన్ననుమానించావు....” అన్నాడతడు.

“నువ్వు మాట్లాడకు....” అన్నాడు విసీల్. అతడు ప్లాస్టిక్ డబ్బామీద మూత పెట్టాడు.

కిల్లర్ మరింత తేలికగా నిట్టూర్చాడు.

“విల్సన్ చేసిన పొరపాటువల్ల అనవసరంగా నీవంటి వాడికి మా సావరం తెలిసిపోయింది. ఈ కేసులో నీ సంబంధ మూలేదు. అయినా విల్సన్ స్వార్థంతో మమ్మల్ని మోసగించి—ఆ మోసం నీవల్ల జరిగినట్లు భ్రమలో వుంచా లనుకున్నాడు నన్ను. అందుకు ఫలితమనుభవిస్తాడు....” అన్నాడు వినీల్.

“నా అమాయకత్వాన్ని గ్రహించావు. అదే నాకు సంతోషం —” అన్నాడు కిల్లర్.

“నువ్వు మాట్లాడకు....” అన్నాడు వినీల్ తీవ్రంగా.

ఇద్దరూ కాసేపు మౌనంగా కూర్చున్నారు.

సుమారు గంట గడిచేక ఆ హాల్లోకి విల్సన్ ప్రవేశించాడు.

“రా—విల్సన్—ఇలా వచ్చి కూర్చో—” అన్నాడు వినీల్. అతడు చూపిన ప్రకారం కిల్లర్ పక్కనే కూర్చున్నాడు విల్సన్.

“ఇతడి వివరాలు తెలుసుకున్నారా?” అన్నది విల్సన్ మొదటి ప్రశ్న.

“అతడు చెప్పేది ఆసక్తికరంగా వుంది. నువ్వూ కూడా విను...” అన్నాడు వినీల్.

విల్సన్ కోసం కిల్లర్ మళ్ళీ తన కథ చెప్పాడు.

కథ పూర్తికాగానే విల్సన్ నవ్వి—“లై డిటెక్టర్లో ఇతడి కథలోని నిజానిజాలు తేల్చలేకపోయారా?” అన్నాడు.

“ఇతడి కథపై నీ అభిప్రాయమేమిటి?” అంటూ లై డిటెక్టర్ ఆన్ చేశాడు వినీల్. విల్సన్ మాట్లాడ్డం ప్రారంభించగానే మరో రెండు మీటలు నొక్కాడు.

“అంతా శుద్ధ అబద్ధం—” అన్నాడు విల్సన్.

ఆ డిటెక్టర్లో ఆకుపచ్చ చుక్కలు వెలిగాయి. కానీ వినీల్ పరికరం వంక కాక విల్సన్ వంక చూస్తూ—"ఆ విషయం నాకూ తెలుసు. అతడి మాటలు నమ్ముతున్నా నన్న భ్రమ అతడికి కలిగించి నిన్ను రప్పించానిక్కడికి. అతడు నీ గురించి అబద్ధం చెప్పాడు. అందుకు శిక్ష నీవే అతడికివ్వాలి. ఈ డబ్బా మూత తెరు—" అన్నాడు.

కిల్లర్ తడబడ్డాడు.

వినీల్ తన మాటలు నమ్మలేదా? ఇప్పుడు తనకు ప్రాణాపాయం తప్పదా?

అతడాలోచిస్తూండగానే విల్సన్ ప్లాస్టిక్ డబ్బా మూత తీశాడు. ఆ వెను వెంటనే బుస్సుమంటూ తాచు పాము విల్సన్ని కాటేసింది.

విల్సన్ గొంతులోంచి కేక కూడా రాలేదు.

చూస్తూండగా అతడి శరీరం నల్లగా మాడిపోయింది. అతడు నేలకూలాడు.

"డియర్ మిస్టర్ కిల్లర్! ఇది నా అనుచరులను శిక్షించే పద్ధతి నీవు నా అనుచరుడివి కాకపోయినా, నన్ను మోసగించకపోయినా రేపు నిన్నూ ఇదే పద్ధతిలో శిక్షించబోతున్నాను. నా స్థావరంలో పరాయివాళ్ళకు చోటు లేదు. రేపటిదాకా నీకెందుకవకాశమిస్తున్నానంటే—నా పెంపుడు పాము రోజుకొక్కడిని మాత్రమే కాటేస్తుంది మరి!" అంటూ వినీల్ ప్లాస్టిక్ డబ్బామీద మూత పెట్టేసి చప్పట్లు కొట్టాడు.

ఆరడుగుల నల్లటివాడు వచ్చి వినీల్ ఆదేశం ప్రకారం విల్సన్ శవాన్నీడ్చుకొని వెళ్ళిపోయాడు.

"నువ్వింక బుద్ధిగా వెళ్ళి నీ గదిలో పడుకో—" అన్నాడు వినీల్.

"నీకు బుద్ధి చెప్పిగానీ నేను పడుకోను—" అంటూ కిల్లర్ మెరుపు వేగంతో లేచాడు.

విసీల్ చటుక్కున చప్పట్లు కొట్టాడు. అయితే అరడుగుల నల్లనివాడొచ్చేలోగా—అతడు కదలలేని స్థితిలోకి మారిపోయాడు.

కిల్లర్ అతణ్ని కూడా క్షణాలమీద పడగొట్టాడు.

తర్వాత ఇల్లంతా కలియదిరిగాడు.

ఆ యింట్లో ఇంకెవ్వరూ లేరు. ఓ పక్కగదిలో విల్సన్ శవముంది.

కిల్లర్ ఆ యిద్దర్నీ బంధించడానికి తాడుకోసం వెతికి సంపాదించాడు. దాంతో ఆ యిద్దర్నీ ఒకరికొకర్ని కలిపి కట్టేసి ఎదురుగా కూర్చున్నాడు.

"ఇంత సులభంగా నన్నూ, నా అనుచరుణ్ని పడగొట్టగల మగాడీ భూప్రపంచంలో లేడని నమ్మాను—" అన్నాడు విసీల్ వాపోతూ.

"అయాం మే కిల్లరాఫ్ సచ్ ఒపినియన్స్!" అన్నాడు కిల్లర్.

తానున్న ఊరికి సుమారు పదిహేను కిలోమీటర్ల దూరంలో వున్న ఆ యింటి వివరాలు కిల్లర్ పోలీసులకు చెప్పడానికెంతో వ్యవధి అవసరం లేకపోయింది.

6

కిల్లర్‌కంతా ఆశ్చర్యంగా వుంది.

ఒక్క లై డిటెక్టర్ కారణంగా తన ప్రాణాలు కాపాడబడ్డాయి.

లై డిటెక్టరుంటే ఎన్ని ప్రాణాలైనా నిలబెట్టవచ్చు. నేరస్థుల ఆచూకీ తెలుసుకోవచ్చు. ప్రపంచంలో నేరాలనే రూపుమాపవచ్చు.

తనకది రావాలని అతడు పోలీసు డిపార్టుమెంటుని కోరాడు. కానీ అది ప్రభుత్వ పరిశోధనా సంస్థలకు పరీక్షకు వెళ్ళింది.

కిల్లర్ నిరుత్సాహపడ్డాడు.

ఆ నిరుత్సాహంతోనే అతడొకరోజు సాయంత్రం బజార్లో తిరుగుతూండగా ఓ వ్యక్తి యెదురై పలకరించాడతణ్ని.

"నువ్వెవరో నాకు తెలియదు...." అన్నాడు కిల్లర్.

"గోడలకు చెవులుంటాయి. గోడల్లేని చోటుకు వెళ్ళి మాట్లాడుకుందాం—" అన్నాడతడు.

ఇద్దరూ ఓ పార్కుకి వెళ్ళారు.

చుట్టుపక్కల జనంలేరు.

"హేట్సాఫ్ టూ యూ—డిటెక్టివ్ కిల్లర్! ప్రభుత్వం యెన్నోవిధాల ప్రయత్నించి పట్టుకోలేకపోతున్న అంతర్జాతీయ ముఠా వ్యక్తుల్ని పోలీసులకప్పగించావు...." అన్నాడతడు.

"నువ్వెవరు?"

"ఆ ముఠాకోసం యెన్నో పథకాలు వేస్తున్న ప్రభుత్వోద్యోగిని. అయితే వారి మనుషులు మా సంస్థలో కూడా కొందరు చేరినందువల్ల మా పథకాలు ముందే వారికి తెలిసిపోతున్నాయి. నాకు సుజాత గురించి కొన్ని వివరాలు తెలిసి ఆమె యింటి పనివాడుగా చేరి ఎన్నో రహస్యాలు తెలుసుకున్నాను. ఆమె నన్ననుమానించకుండా జాగ్రత్త తీసుకున్నాను. కానీ నాకు తెలిసిన రహస్యం ఎవరికి చెప్పాలో తెలియదు. అందుకే మా డిపార్టుమెంటుకి చెందని నిన్నెన్నుకున్నాను. నువ్వు నా ఎన్నిక సరైనదని ఋజువు చేశావు...." అన్నాడతడు.

కిల్లర్ ఆశ్చర్యంగా—"నువ్వు నన్నెన్నుకున్నావా? ఎలా?" అన్నాడు.

అతడొక కవర్ని కిల్లర్ కందించి—"ఇందులో యాత్రై తెలుస్తాయి. ప్రభుత్వం తరఫున నీకు నేనందజేస్తున్న ఫీజిది. జరిగిందంతా పూర్తిగా మర్చిపో. ప్రభుత్వానికందిన తాళపత్రగ్రంథాలవల్ల చాలా గొప్ప విశేషాలు తెలుస్తున్నాయి. అదంతా రహస్యంగా ఉండాలి...." అన్నాడు.

"ఇంతకీ నువ్వే విల్సన్ని బుట్టలో వేసుకున్నావా?" అన్నాడు కిల్లర్.

"లేదు. ఒకరోజు ముందు నేనే విల్సన్‌గా వచ్చి నిన్ను కలుసుకున్నాను. సుజాతను చంపి తాళపత్ర గ్రంథాలు సాధించాను. నిన్ను నరరూప రాక్షసులకు వదిలిపెట్టి—ఆ దుర్మార్గుల దృష్టి నాపై పడకుండా కాపాడుకున్నాను. మరి నాకు సెలవు. ఇంకేమీ అడక్కు" అంటూ అతడు లేచి వెళ్ళిపోయాడు.

కిల్లర్ మ్రాన్పడిపోయాడు.

అంటే—విల్సన్ వినీల్‌ని మోసం చేయలేదు.

లై డిటెక్టర్ని తనవారిపై ప్రయోగించకూడదన్న వినీల్ సిద్ధాంతం అతణ్ని మోసగించింది.

కళ్ళతో చూసేదంతా నిజంకాదు.

లై డిటెక్టర్ తను నిజం చెబుతున్నాడో లేదో తెలుసుకోగలదు తప్ప—అసలు నిజాన్ని తెలుసుకోలేదు.

కిల్లర్ కప్పుడు లై డిటెక్టర్ గురించిన బెంగ పోయింది.

ఓ అంతర్జాతీయ ముఠా ఆటకట్టించే అవకాశాన్ని తనకిచ్చిన ఆ ప్రభుత్వోద్యోగిని మనసులో అభినందించుకుంటూ అతడు రామేశ్వరమూర్తి ఇంటికి బయల్దేరాడు.

—:అయిపోయింది:—